

అంబేద్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - చాగల్లు

గుంటూరు జిల్లా పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహంపై మూత్రవిసర్జన చేసి అవమానించిన నిందితుని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు చాగల్లు మండలం కుంకుడుమిల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు. రాష్ట్రంలో ఇలాంటి దారుణ ఘటనలు చోటు చేసుకోవడం సిగ్గుచేటన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిరసనలో రొక్కల సుబ్బారావు, చిన్నం నాగరాజు, చిన్నం శ్రీను, గాడి రాజ్‌కుమార్, కె.వీర్రాజు, చిన్నం పరశురామ్, ఎ.రాజు, చదలవాడ మురళి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు పునాది చిత్రలేఖనం

చిత్రలేఖనం పోటీలకు అపూర్వ స్పందన

వివిధ పాఠశాలల నుంచి తరలొచ్చిన విద్యార్థులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

చిన్నారుల్లో సృజనాత్మకతకు పునాది చిత్రలేఖనం అని పలువురు వక్తలు అన్నారు. దామెర్ల రామారావు, సపాద శత జయంతి(125వ)ని పురస్కరించుకుని గోదావరి బాలోత్సవం, మాదేటి రాజాజీ ఆర్ట్ అకాడమీ, గోదావరి జిల్లా కార్టూనిస్టుల సంఘం, ఫోరం ఫర్ ఆర్టిస్టుల సంయుక్త ఆధ్వర్యంలో దానవాయిపేట మున్సిపల్ హైస్కూలులో చిత్రలేఖనం పోటీలు ఆదివారం జరిగాయి. దీనికి అపూర్వ స్పందన లభించింది. వివిధ పాఠశాలల నుంచి వేయి మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ చిత్రలేఖనం పోటీలు జరిగాయి. అనంతరం మెజీషియన్ శ్రీరాములు ఆధ్వర్యంలో మ్యాజిక్ షో నిర్వహించారు. తరువాత బహుమతి ప్రదానోత్సవ సభను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సుమారు 5 గంటల పాటు జరిగిన ఈ కార్యక్రమం విజ్ఞానం, వినోదం, వికాసం మేళవింపుతో ఉత్సాహ భరితంగా సాగింది. చిత్రలేఖనం పోటీలో పాల్గొని చిన్నారులు గీసిన చిత్రాలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభకు గోదావరి బాలోత్సవం అధ్యక్షులు వివిఎస్ఎన్.కృష్ణకుమార్ అధ్యక్షత వహించారు. తొలుత దామెర్ల రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిత్రకారంగంలో దామెర్ల రామారావు ప్రత్యేకతను ఈ సందర్భంగా కృష్ణకుమార్ గుర్తు చేశారు. జెవివి పూర్వ రాష్ట్ర అధ్యక్షులు చల్లా రవికుమార్ మాట్లాడుతూ దామెర్ల రామారావు గీసిన చిత్రాలు ఇప్పటికీ సజీవం అని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఆయనకు లభించిన గుర్తింపును మరోసారి గుర్తు చేశారు. చిన్నారుల ఆసక్తిని గమనించి చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సహించిన తల్లిదండ్రులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్య అంటే కేవలం ర్యాంకులు, మార్కులే పరిమితం కాకూడదని చిన్నారుల ఆసక్తిని గుర్తించి ఆ దిశగా ప్రోత్సహిస్తే ఆయా రంగాల్లో వారి సృజనతో నూతన ఆవిష్కరణలు చేస్తారన్నారు.

జాషువా సాంస్కృతిక కేంద్రం కార్యదర్శి గుండు నారాయణరావు మాట్లాడుతూ చిత్రలేఖనం క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రతను నేర్పుతుందన్నారు. పాటలు, చిత్రలేఖనం, పుస్తక పఠనం వంటి అలవాట్లు చిన్నారుల్లో విజ్ఞానాన్ని, వికాసాన్ని నింపుతాయని తెలిపారు. జనవరి 2024లో రాజమహేంద్రవరంలో జరిగబోయే బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. దామెర్ల రామారావు మనవడు కెప్టెన్ డెన్నిస్ దామెర్ల మాట్లాడుతూ సాధారణ విద్యార్థి స్థాయి నుంచి తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నవయసులోనే కెప్టెన్ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. చిత్రలేఖనం పోటీల్లో పెద్దసంఖ్యలో చిన్నారులను ప్రోత్సహించిన తల్లిదండ్రులందరికీ అభినందనలు తెలిపారు. ప్రముఖ ఆర్టిస్ట్ సునీల్ కుమార్ మాట్లాడుతూ గోదావరి బాలోత్సవం మార్పునకు నాంది పలికిందన్నారు. సృజనాత్మకతకు చిత్రలేఖనం పునాది అని వివరించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ దామెర్ల డెన్నిస్‌ను నిర్వాహకులు సత్కరించారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ తరపున సునీల్ కుమార్, గోదావరి జిల్లా కార్టూనిస్టుల సంఘం తరపున కార్టూనిస్ట్ శేఖర్, జాషువా సాంస్కృతిక కేంద్రం తరపున జి.నారాయణరావు, మాదేటి రాజాజీ ఆర్ట్ అకాడమి తరపున మాదేటి రవి, గోదావరి బాలోత్సవం బృందం పి.తులసి, రవికాంత్, పివిఎస్ఎన్.రాజు, సాయిబాబు, అద్దంకి రాజాయోనా, పట్నాయక్ విజేతలకు బహుమతులు అందజేశారు.



చిత్రలేఖనం పోటీలకు హాజరైన చిన్నారులు



దామెర్ల రామారావుకు నివాళులర్పిస్తున్న నిర్వాహకులు



గీచిన చిత్రాలను చూపుతున్న చిన్నారులు



ముగింపు సభలో మాట్లాడుతున్న దామెర్ల మనువడు డెన్నిస్ దామెర్ల



శంకుస్థాపన చేస్తున్న మంత్రి సింధియా

భవిష్యత్తు అవసరాల రీత్యా టెర్మినల్ విస్తరణ

కేంద్ర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

భవిష్యత్తు అవసరాల రీత్యా విమానాశ్రయాలను విస్తరిస్తున్నామని, అందులో భాగంగానే మధురపూడి ఎయిర్‌పోర్టులో రూ.347 కోట్లతో టెర్మినల్ భవనం విస్తరణకు శ్రీకారం చుట్టామని కేంద్ర విమానయాన, ఉక్కు శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. మధురపూడి విమానాశ్రయంలో టెర్మినల్ భవన విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్లలో దేశంలో విమానయానం అభివృద్ధి రెట్టింపు అయ్యిందన్నారు. ఈ తొమ్మిదిన్నరేళ్లలో కొత్తగా 75 ఎయిర్ పోర్టులు వచ్చాయన్నారు. ప్రస్తుతం 149 విమానాశ్రయాలు ఉన్నాయని, వీటిని220కి పెంచుతామని తెలిపారు. ప్రస్తుతం మధురపూడిలో నిర్మిస్తున్న కొత్త టెర్మినల్ పాయింట్ 21.94 వేల చదరపు అడుగుల వైశాల్యం కలిగి ఉంటుందన్నారు. రద్దీ వేళల్లో 2,100 మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం ఉంటుందన్నారు. 28 చెక్ ఇన్ కౌంటర్లు, నాలుగు అరైవల్ కక్లోజర్స్, 600 కార్లకు సరిపడా కార్ పార్కింగ్, 5 స్టార్ రేటింగ్‌తో ఈ కొత్త టెర్మినల్ రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ ఎయిర్ పోర్టులో ప్రస్తుతం 18 సర్వీసులు నడుపుతున్నామని, రానున్న రోజుల్లో 25 వరకు సర్వీసులను పెంచుతామన్నారు. ప్రస్తుతం 250 మంది ప్రయాణికులకు ఇక్కడ నుంచి నిత్యం ప్రయాణాలు చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో రోజుకు 1,400 మంది ప్రయాణాలు కొనసాగించేందుకు వీలుగా విస్తరణ పనులు చేపట్టామన్నారు. వెయ్యేళ్ల ఉత్సవాలు చేసుకుంటున్న రాజమహేంద్రవరం నగర సాంస్కృతిక వారసత్వం దేశానికే తలమానికమన్నారు.

రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం మౌలిక సదుపాయాలు ఐటీ శాఖ గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ మధురపూడి విమానాశ్రయ సేవలు మరింత విస్తరించే దిశగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇటీవల భోగాపురంలో 2,200 ఎకరాల్లో రూ.4 వేల కోట్లతో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేశారన్నారు. 24 మాసాల్లో ఇది పూర్తవు తుందన్నారు ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య రంగాలకు ఈ ఎయిర్‌పోర్టు విస్తరణ వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎంఎల్ఎ జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి సంకల్పించిన కేంద్రమంత్రి సింధియాకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో సహా విభజన హామీలు నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.350 కోట్లు వెచ్చించి కొత్త టెర్మినల్ నిర్మిస్తోందన్నారు. ఇది రాజమండ్రి చరిత్రలో నూతన అధ్యాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, జెసి ఎన్.తేజ్‌భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంజీవ్ కుమార్, మధురపూడి విమానాశ్రయ అధికారి ఎస్.జ్ఞానేశ్వరరావు, పలువురు విమాన యాన అధికారులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

104 ఉద్యోగులకు ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని 104 ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. 104 యూనియన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం పేపరుమిల్లు వద్దగల బిటిఆర్ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో 104 ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆలపాటి లక్ష్మణరావు మాట్లాడారు. ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి 104 ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. రెగులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అప్పటి వరకూ కనీసవేతనం ఇవ్వాలని, డిమాండ్ చేశారు. ఈ సమావేశంలోఅన్ని మండలాల నుంచి 104 సిబ్బంది, నాయకులు పాల్గొని సమస్యలను వివరించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ట్రెజరర్ ఆజాం, డివిజన్ నాయకులు, జిల్లా నలుమూలల నుండి వచ్చిన 104 డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

3వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-తాళ్లపూడి

మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో గల విశ్వేశ్వరస్వామి, సుబ్రహ్మణ్య ఆలయ సముదాయం వద్ద ఆదివారం 3వేల మందికి అన్నదానం నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయ వద్ద జరిగిన మహా కుంభాభిషేక, కార్తీక మాసం సందర్భంగా ఈ అన్నదానం చేశామని ఆలయ అర్చకులు కె.విశ్వనాథశర్మ, శశి శేఖర మిత్ర బందం సభ్యులు తెలిపారు. ప్రతి ఏడూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ఉత్సాహంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరుగుతున్న సౌత్ అండ్ వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం రెండో రోజుకు చేరాయి. పలు విభాగాల్లో క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన ప్రథమ, ద్వితీయ, తతీయ క్రీడాకారులకు వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు, క్రీడా ప్రముఖులు పతకాలు ప్రదానం చేశారు. సౌత్ అండ్ వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ మెన్ 55 కేజీ కేటగిరిలో మొదటి మూడు స్థానాలను మహారాష్ట్ర నాందేడ్ యూనివర్సిటీ విద్యార్థి ఆకాష్ శ్రీనివాస్ గౌడ్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి ఇ.కోటేశ్వరరావు, తమిళనాడు తిరువల్లూర్ యూనివర్సిటీ విద్యార్థి పి.బాలాజీ పాల్గొన్నారు.

61 కేజీ కేటగిరిలో తిరువల్లూర్ యూనివర్సిటీ విద్యార్థి రుతేశ్వర, మంగళూరు యూనివర్సిటీ విద్యార్థి సుబ్రహ్మణ్యం, రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థి ఎస్.అబ్దుల్ వరుసుగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

67 కేజీ కేటగిరిలో అన్నా యూనివర్సిటీ విద్యార్థి శ్యామ్‌సుందర్‌రాజు, భారతి విద్యాపీఠ్ విద్యార్థి పాండురాంగ్, మద్రాస్ యూనివర్సిటీ విద్యార్థి సి.దినేష్ మొదటి స్థానాల్లో నిలిచారు.



విజేతలకు పతకాలు అందిస్తున్న విసి పద్మరాజు తదితరులు

ఉమెన్ విభాగం 45 కేజీల కేటగిరిలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి బి.రాజేశ్వరి ప్రథమ, కోల్హాపూర్ శివాజీ యూనివర్సిటీ విద్యార్థి దోనే అపేక్షదత్తరి ద్వితీయ, పూనే సావిత్రి బాయ్ పూలే యూనివర్సిటీ విద్యార్థి హర్షద తతీయ స్థానంలో నిలిచారు.

49 కేజీ కేటగిరీలో కొల్హాపూర్ శివాజీ యూనివర్సిటీ విద్యార్థి టి.అరతిరాఘవేంద్ర, ముంబై యూనివర్సిటీ విద్యార్థి దల్వి సౌమ్య, ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి బి.చంద్రిక తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

55 కేజీల కేటగిరీలో కాలికట్ యూనివర్సిటీ విద్యార్థి మానికం షీన్, మంగళూరు యూనివర్సిటీ విద్యార్థి యుక్తిక, సావిత్రిబాయి పూలే యూనివర్సిటీ విద్యార్థి వైష్ణవి జ్ఞానేశ్వరి మొదటి మూడు స్థానాల్లో నిలచారు.

59 కేజీల కేటగిరీలో మద్రాస్ యూనివర్సిటీ విద్యార్థి టిఎం.కీర్తన, ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి ఎం.దీపనయోమి, యోగివేమన యూనివర్సిటీ విద్యార్థి లిజా కంసా మొదటి మూడు స్థానాల్లో నిలిచి బంగారు, వెండి, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు.

అనంతరం విదజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నన్నయ విసి ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, క్రీడా ప్రముఖులు ఎఐయు అబ్జర్వర్ మజర్ ఉల్ ఖమర్, అర్జున అవార్డీ నీలంశెట్టి లక్ష్మీ, వెయిట్ లిఫ్టింగ్ ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలు, విశ్వవిద్యాలయ అధికారులు పి.సురేష్ వర్మ, కె.శ్రీరమేష్, వై.శ్రీనివాసరావు, డి.జ్యోతిర్మయి, కె.సుబ్బారావు, కె.రమణేశ్వరి, వి.పెర్సిస్, బడేటి వెంకటరామయ్య, శ్యామ్ కుమార్, రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం అందజేత

ప్రజాశక్తి- గోపాలపురం

తుపాను కారణంగా వెంకటాయపాలెం, చెరుకుమిల్లి, చిట్యాల గ్రామాల్లో ఇళ్లు పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్నటువంటి బాధితులకు సర్పంచులు మేక సతీష్‌బాబు, ముళ్లపూడి వరలక్ష్మి, నూతన సరోజిని ఆదివారం పరిహారం అందజేశారు. 8 మంది బాధితులకు రూ.10వేల చొప్పున నగదు, 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ నూనె, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు ఇతర నిత్యావసర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ కొనకండ్ల శ్రీనివాస్, ముళ్ళపూడి వివేక్, నూతంగి దొరబాబు, ముచ్చికల రవి, రాజు పాల్గొన్నారు.


తెలుగు మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - గోపాలపురం

రెండో అంతర్జాతీయ తెలుగు మహా సభను విజయవంతం చేయాలని, కమిటీ నిర్వాహక సభ్యులు రాపాక ఫణికిషోర్ కోరారు. స్థానిక శర్వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. ఆంధ్ర సరస్వతి పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాజరాజ నరేంద్రుల సహస్రాబ్ది నీరాజనంగా ఈ సభలను నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరం గైట్ కళాశాల ప్రాంగణంలో జరుగుతాయన్నారు. అధ్యక్షులుగా డాక్టర్ కేశిరాజు శ్రీనివాస్, కెవివిఎస్ఎన్.రాజు వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బాపూజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ గూడూరు శ్రీనివాసరావు, మెహర శ్రీ స్కూల్ డైరెక్టర్ సుగ్గన బోయిన కృష్ణ, చిట్యాల కాన్వెంట్ ప్రిన్సిపల్ నరేంద్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు



ఉత్సాహంగా వన సమారాధనలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, కడియం, కొవ్వూరు రూరల్

కార్తీక మాసం, చివరి ఆదివారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీ ప్రదేశాలు, మామిడి, కొబ్బరి, ఖోఖో తోటలు, కార్తీక వన సమారాధనలతో కిటకిటలాడాయి. ఆటపాటలతో, విందు వినోదాలతో ఉత్సాహంగా జరిగాయి. పాలంగిలో నిర్వహించిన వనసమారాధనలో ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి తదితరులు పాల్గొన్నారు. తాడిపర్రులో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సంఘం సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనకు వెలగదుర్రు సర్పంచ్ సాగి పద్మావతి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మాదిరాజు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కలగ సుబ్రహ్మణ్యం, ధవళేశ్వరం, విజ్జేశ్వరం బ్రాహ్మణ సంఘం సభ్యులు సీతారామచంద్రశేఖర్, పొట్లచెరువు రాధాకృష్ణ, మాగాపు సుబ్బారావు, కోడూరు చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

కడియం మండలం బుర్రిలంక ఈశ్వర పామ్ నర్సరీ అధినేత, వైసిపి కడియం మండల బూత్ కమిటీ కన్వీనర్ తాడాల చక్రవర్తి నర్సరీలో ఆదివారం కార్తీక వనభోజనాల సందడి నెలకొంది. శాస్త్రోక్తంగా ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. ఈ వన సమారాధనకు వైసిపి సిజిసి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, వైసిపి మండల వై.స్టాలిన్, నర్సరీ రైతులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. అతిథులకు తాడాల చక్రవర్తి ఆయన కుమారులు కుమార్, అనిల్ స్వాగతం పలికి దుశ్శాలువాలతో సత్కరించారు.

కొవ్వూరు టౌన్ వేములూరు రోడ్డులో దుద్దుకూడి గార్డెన్స్ నిర్వహించిన గౌడ, శెట్టిబలిక వన సమారాధలో హోం మంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల్లో కార్తీక వనసమారాధనలు ఒక భాగమన్నారు. సందర్భంగా కొవ్వూరులో హోం మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న షెడ్, ప్రభుత్వ స్థలం గౌడ శెట్టిబలిజ సంఘం కమ్యూనిటీ హాల్ అవసరాల నిమిత్తం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.



వనసమారాధలో బహుమతులు అందిస్తున్న మంత్రి వనిత

కౌలు రైతుల పంటలు ధ్వంసం


ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని భీమోలులో కౌలు రైతులు పండించిన పంట పొలాలను పట్టాదారు రైతులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. స్థానికులు, కౌలు రైతులు తెలిపిన వివరాల మేరకు భీమోలు పరిధిలో సుమారు 346 ఎకరాల భూమి విషయంలో 70 ఏళ్ల నుంచి కౌలు రైతులకు, పట్టా రైతులకు మధ్య వివాదం నడుస్తోంది. కొంత కాలం ఈ వివాదం కోర్టులో కూడా ఉంది. న్యాయస్థానం తీర్పు కౌలు రైతులకు అనుకూలంగా వచ్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం కౌలురైతులు పెదవేగి జగ్గారావు, కొండిబోయిన అన్నవరం పొలంలో ఉన్న వరి చేనును పట్టాదారులు, మరికొంత మంది ధ్వంసం చేయడం ప్రారంభించారు. సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అడ్డుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలా కాకుండా పంటలను పాడుచేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ వారిని హెచ్చరించారు. పొలాల వద్ద పోలీస్‌పికెట్ ఏర్పాటు చేశారు.

ఎంఎల్ఎకు ఆహ్వాన పత్రం అందజేత

ప్రజాశక్తి - బిక్కవోలు

బిక్కవోలులో డిసెంబర్ 17న నుంచి 24వరకూ జరిగే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవానికి రావాలంటూ అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ఆహ్వాన పత్రికను అందించి ఉత్సవ కమిటీ ఆహ్వానించింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



చంద్రశేఖరరావుకు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల తదితరులు

తిరుమలరావుకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పితృ వియోగంతో బాధపడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావును పలువురు ప్రముఖులు ఆదివారం పరామర్శించారు. కాతేరులో తిరుమలరావు తండ్రి నున్న చంద్రశేఖరరావు ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి, కొవ్వూరు మాజీ ఎంఎల్ఎ, మాజీ మంత్రి కెఎస్.జవహర్, జొన్నలగడ్డ చౌదరి, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్, రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం, శశి విద్యాసంస్థల చైర్మన్ బి.రవికుమార్, హర్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ సాయి ప్రసాద్, మాధవి నర్సింగ్ హోమ్ డాక్టర్ శ్రీమన్నారాయణ తదితరులు ఆయన్ని పరామర్శించారు. చంద్రశేఖరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి చంద్రశేఖరరావుతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. తాను ఎప్పుడు కాతేరుకు వచ్చినా చంద్రశేఖరరావుని కలిసేవారని తెలిపారు. ఆయన కుమారులు తిరుమలరావు, కృష్ణ, సురేష్‌లను కలిసి పరామర్శించానని తెలిపారు.

నష్టాన్ని బట్టి సాయం అందించాలి

ప్రజాశక్తి-గోపాలపురం

తుపాను వల్ల దెబ్బతిన్న రైతన్నలకు మొక్కుబడి సాయం కాకుండా ఎకరాకు రూ.20వేలు తగ్గకుండా పరిహారం అందించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు డిమాండ్ చేశారు. ఆదివారం గంగోలు పంచాయతీ రాంపాలెంలో తుపాను వల్ల దెబ్బతిన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గంగోలు గ్రామ కమిటీ అధ్యక్షులు గేరా ఫణీంద్ర, మందపాటి సత్యనారాయణ, పుట్టుపు రామపరమేశ్వర రావు, మందపాటి మణికంఠ, పుట్టుపు సతీష్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.20వేల పరిహారం ఇవ్వాలి

తాళ్లపూడి : తుపాన కారణంగా పంటలను నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేలు నష్టపరిహారం ఇవ్వాలని కొవ్వూరు మాజీ ఎంఎల్ఎ, జనసేన నాయకులు టివి.రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆదివారం గజ్జరం, అన్నదేవరపేట తదితర గ్రామాల్లో ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. నష్టపోయిన రైతులకు పూర్తిగా న్యాయం జరిగే వరకూ జనసేన పోరాడుతుందన్నారు.

లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న బోసుబాబు

గోకవరం : తుఫాను అనంతరం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తిరిగి పాదయాత్ర ప్రారంభించిన నేపథ్యంలో గోకవరానికి చెందిన జడ్‌పిటిసి మాజీ సభ్యులు, కాకినాడ జిల్లా డాక్టర్స్ విభాగం అధ్యక్షులు పాలూరి బోసుబాబు యువగళం పాదయాత్రలో పాల్గొని మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో లోకేష్ పాదయాత్ర ప్రజాధారణతో విజయవంతంగా సాగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అందరికీ బోసుబాబు కతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణంలో ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి చేసిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. డిఎస్‌పి వర్మ ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడేనికి బస్సు బయలు దేరింది. రాజమహేంద్రవరానికి చెందిన సువ్వాడ గోవిందరాజు బస్సుకు అడ్డు రావడంతో డ్రైవర్ మందలించాడు. దీంతో గోవిందరాజు తన కుటుంబ సభ్యులు, బంధువులు మజ్జి బాలదుర్గాప్రవీణ్, సువ్వాడ భార్గవ రామకృష్ణ సాయి, సువ్వాడ జస్వంత్ కార్తీక్‌లతో కలిసి కారులో బస్సును వెంబడించారు. నిడదవోలు పట్టణంలో గణపతి సెంటర్ వద్ద బస్సును ఆపి డ్రైవర్ గూడవల్లి ధనశంకర్‌పై మారణాయుధాలతో దాడి చేశారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఎస్‌పి జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్టు చేశామని, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలిస్తామని ఆయన తెలిపారు. గతంలో నెల్లూరు జిల్లా కావలిలో ఇలాంటి సంఘటన ఒకటి జరిగిందని, ప్రజలకు సేవలు అందించే ఉద్యోగులపై దాడి చేయడం అత్యంత నేరపూరితమైన చర్య అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంగన్‌వాడీల సమ్మె 12కు వాయిదా

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 8 నుంచి తలపెట్టిన సమ్మెను 12కి వాయిదా వేసినట్లు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తెలిపారు. ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని, కొన్ని సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల నుంచి హామీ వచ్చిందని పేర్కొన్నారు. మిచౌంగ్ తుపాను కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్న విన్నపం మేరకు సమ్మెను వాయిదా వేసినట్లు చెప్పారు. ఇదే విషయాన్ని సమ్మె నోటీసు ద్వారా మహిళా శిశుసంక్షేమ శాఖ కమిషనర్‌కు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

ఎంఎల్‌ఎ గొల్లపల్లి దంపతుల పూజలు

ప్రజాశక్తి - యానాం

యానాం గౌతమి గోదావరి తీరమైన ఫెర్రీ రోడ్‌లో ఆదివారం ఎంఎల్‌ఎ గొల్లపల్లి అశోక్, ఆయన సతీమణి లక్ష్మీస్నేహ హరిహర మహాయజ్ఞంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది తరలి వచ్చారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానంలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు. యానాం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బాబీకి ఐ బ్యాంక్ సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

నేత్రదానంపై అవగాహన కల్పించి, అధిక కార్నియాల సేకరణకు కృషి చేసిన ధూళిపూడి వెంకటరమణ (బాబి)ని బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ ఘనంగా సత్కరించింది. బాదం బాలకష్ణ ఐ బ్యాంక్ 17వ వార్షికోత్సవం సందర్భంగా కాకినాడలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాదం బాలకృష్ణ, లయన్స్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సీ పోర్టు సిఇఒ మెర్ల మురళీధర్, లయన్స్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల తయారీ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని ఇర్రిపాక ఏలేరు నది తీరాన భ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి ఆలయం వద్ద మహా కుంభాభిషేకానికి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. మట్టి శివలింగాల తయారీ ఊపందుకుంది. కోటి శివలింగాలకు ప్రతిష్టాత్మకంగా జ్యోతుల నెహ్రూ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నారు. మట్టి శివ లింగాల తయారీకి నియోజకవర్గం నుండి పలువురు ప్రజలు హాజరై మట్టి శివలింగాల తయారు చేస్తున్నారు. విగ్రహాల తయారీలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం పొందాలని నెహ్రూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

దేశ రక్షణకు బిజెపిని ఓడించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించి దేశాన్ని రక్షించాలని సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కసిరెడ్డి గణేశ్వరరావు అన్నారు. ఈ నెల 18న ఏలేశ్వరంలో జరిగే వినోద్ మిశ్రా, అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ ప్రచార జాతాలో భాగంగా ఆదివారం పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. దేశ ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి కార్పొరేట్ శక్తుల లాభాల కోసం పాలన సాగిస్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. ఈ కార్యక్రమంలో కందుల ప్రసాద్, గుమ్మడి రమణ, కంబాల బాలయ్య, కందుల క్రాంతికుమార్, కాకర అర్జున్, కొంతం రాజు, కోన గంగాధర్, కందుల సతీష్ కుమార్, ఇందుగపల్లి వంశీ, కోడిగుడ్ల శివ, సందక ప్రసాద్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్స్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా గుప్తా

ప్రజాశక్తి - గండేపల్లి

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా గుప్తా సర్టిఫికెట్ తీసుకోవడం పట్ల గండేపల్లి ఆర్యవైశ్య సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేసింది. విజయవాడ ఐనా ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ 2023 కాన్ఫరెన్స్‌లో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పాలకుర్తి గాయత్రీ, వాసవి క్లబ్ వికెఎస్‌పి గండేపల్లి క్లబ్ ప్రెసిడెంట్‌కొత్త లక్ష్మీ నారాయణ వీర గుప్తా ట్రైనర్ సర్టిఫికేట్, పిన్‌ను అందుకున్నారు. వాసవి క్లబ్, ఆర్య వైశ్య సంఘం అభినందనలు తెలిపారు.


విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం

ప్రజాశక్తి -కరప

విద్యార్థి దశ నుంచిప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరు శ్రీరామారావు అన్నారు. వాకాడలోని మండల పరిషత్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్ నవంబర్ 7 నుండి ఫిబ్రవరి 28 వరకు తలపెట్టిన శాస్త్రీయ దృక్పథం విస్తృత ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆర్థిక పురోగతికి లైవ్ స్టాక్ మిషన్

పశుసంవర్ధక శాఖ జెడి గోవింద్





ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గ్రామీణ స్థాయిలో పశుపోషణ ద్వారా ప్రజలు ఆర్థిక పురోగతి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల పెంపకంతోపాటు పశుగ్రాసం, దాణా తయారీకి రాయితీలు అందిస్తోంది. మాంసం, పాలు, గుడ్ల ఉత్పత్తిని పెంచడం, సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం, గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ పథకం రూపొందించింది. ఈ పథకం గురించి ఆ శాఖ ఉన్నతాధికారి ఎస్‌జిటి సత్యగోవింద్ వివరాలు వెల్లడించారు.

గొర్రెలు మేకల పెంపకం ఎలా..

గొర్రెలు, మేకల పెంపకం పథకంలో భాగంగా 500 గొర్రెలు, 25 పొట్టేళ్లతో ఒక యూనిట్‌గా ఏర్పాటు చేస్తారు. గొర్రె లేదంటే మేక పిల్లల ఉత్పత్తి, పోషణ చేపడతారు. రూ.కోటి అంతకుమించి ప్రాజెక్టు విలువ ఉంటే గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు రాయితీ మంజూరు చేస్తారు. అంతకంటే తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ అందుతుంది. 100 గొర్రెలు లేదంటే మేకలు, 5 పొట్టేళ్లు లేదంటే మేకపోతులు ఒక యూనిట్‌గా తీసుకుంటే అందులో గరిష్ఠంగా రూ.10 లక్షల వరకూ రాయితీఉంటుంది.

కోళ్ల అభివద్ధి పథకం ఎలా ఉంది.

కోళ్ల అభివద్ధి పథకంలో కోడి పిల్లల ఉత్పత్తి, పొదుగు కోళ్ల యూనిట్‌గా ఏర్పాటు చేసుకోవచ్చు. వెయ్యి పెట్టలు, వంద పుంజులు ఒక యూనిట్. రూ.50 లక్షలు అంతకుమించి ప్రాజెక్టు ఖరీదు ఉంటే గరిష్ఠంగా రూ.25 లక్షలు రాయితీ మంజూరు చేస్తారు. అంతకంటే తక్కువగా ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ ఉంటుంది.

పందుల పెంపకం ఎలా..

పందుల పెంపకంలో 100 ఆడ పందులు, 10 మగ పందులతో ఒక యూనిట్‌గా పంది పిల్లల ఉత్పత్తి, పోషణ చేపడుతున్నారు. రూ.60 లక్షలు అంతకంటే ఎక్కువ ఉండే ప్రాజెక్టు ఖరీదులో గరిష్ఠంగా రూ.30 లక్షలు రాయితీ ఇస్తారు. అంతకంటే తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ మంజూరు చేస్తారు. 50 ఆడ పందులు, 5 మగ పందుల యూనిట్‌గా ఏర్పాటు చేసుకుంటే గరిష్ఠంగా రూ.15లక్షల వరకు రాయితీ ఇస్తారు.

పశుగ్రాసం, దాణా తయారీ కేంద్రాలు ఏర్పాటు ఎలా..

పశుగ్రాసం, దాణా అభివృద్ధి పథకంలో సైలేజ్ గడ్డి తయారీ యూనిట్, పశుగ్రాస దిమ్మల తయారీ యూనిట్, సమీకృత దాణా తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. వీటికి రూ.కోటి అంతకుమించి ప్రాజెక్టు విలువ ఉంటే రూ.50 లక్షలు రాయితీ లభిస్తుంది. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50శాతం రాయితీ మంజూరు చేస్తారు.

లబ్ధిదారుల ఎంపిక ఎలా..

లబ్ధిదారులు తాము ఎంచుకునే ప్రాజెక్టుకు సంబంధించి అవగాహన ఉండాలి. మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు నివేదికను తయారు చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. రాయితీపోను మిగిలిన యూనిట్ ఖరీదుకు రుణం పొందేందుకు అవసరమైన పత్రాలు ఇచ్చి బ్యాంకు నుంచి అనుమతి పొంది ఉండాలి. లబ్ధిదారుడు తన సొంత భూమి, కౌలు భూమిలో మాత్రమే ప్రాజెక్టు ఏర్పాటు చేయాలి. వీటిని రాష్ట్ర స్థాయిలో ఏర్పాటయ్యే కమిటీ పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హతలున్న వారిని ఎంపిక చేసి జాతీయ లైవ్ స్టాక్ మిషన్‌కు పంపిస్తుంది. ఎంపిక తరువాత రెండు విడతల్లో సబ్సిడీ నిధులు విడుదల చేస్తారు.

ఈ అవకాశాన్ని ఎలా వినియోగించుకోవాలి

గ్రామీణ స్థాయిలో ఆర్థిక పురోగాభివద్ధికి జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకం, దాణా తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చు. దాదాపుగా 50 శాతం రాయితీ అందిస్తారు. మాంసం, పాలు, గుడ్ల ఉత్పత్తిని పెంచుకుని సరైన మార్కెటింగ్ చేసుకుంటే మంచి ఉపాధి దొరికినట్టే. రైతులు, ఔత్సాహిక రైతులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.


కాకినాడ రూరల్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్, కరప

పేద మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా తమ సమీక్ష డెంటల్ క్లినిక్‌ను నిర్వహిస్తున్నామని డాక్టర్ సువర్ణ రాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో సమీక్ష డెంటల్ క్లినిక్ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సువర్ణ రాజు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంత వైద్యం చాలా ఖరీదుతో కూడుకున్నదని కానీ తమ క్లినిక్‌లో అందరికీ అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. తమ క్లినిక్ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శీతాకాలంలో వృద్ధులకు ఉపయుక్తంగా ఉండేందుకుగాను దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ దంత ఆరోగ్యం-జీవన సౌభాగ్యం అంటూ అందరికీ అందుబాటులో 12 ఏళ్లుగా విశిష్ట వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సువర్ణ రాజు ప్రశంసనీయులని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సువర్ణ రాజు దంపతులను అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో లావణ్య, తాతారావు, సులోచన, అడబాల రత్నప్రసాద్, రాజా, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

కరప నక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్లే గ్రౌండ్‌లో దుప్పట్లు పంపిణీ చేసినట్లు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తెలిపారు. ఆదివారం రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు విన్నపం మేరకు 10 మంది నిరుపేదలకు శీతాకాలం సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు సేవా దక్పథం కలిగి ఉండాలని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింటింగ్ ప్రెస్ విశ్వనాథం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

16, 17న కాకినాడలో టి-20 క్రికెట్

కాకినాడ : ఈ నెల 16, 17 తేదీల్లో కాకినాడలో ఉన్న ఆర్‌ఎంసి క్రీడా ప్రాంగణంలో యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టి-20 క్రికెట్ లీగ్ నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి సురేష్ తెలిపారు. ఆదివారం కాకినాడ అశోక్ నగర్‌లోని ఎంఎస్ఎన్ పాఠశాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే వాళ్లు ఇతర వివరాల కోసం తమ పాఠశాలలోని హెచ్ఎంకు వివరాలు సమర్పించాలని తెలిపారు. విద్యార్థులను క్రీడల వైపు మళ్లించేందుకు తాము ఈ కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఇదయతుల్లా, యుపిఇఐఎఫ్ కాకినాడ సిటీ ప్రధాన కార్యదర్శి రమణ మూర్తి, టిఎస్‌వి.నారాయణ, దేవబాబు, సుజ్ఞాన్, చక్రపాణి, ప్రకాష్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం ఇవ్వాలి

కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రరావు డిమాండ్

ప్రజాశక్తి-రాజోలు

మిచౌంగ్ తుపాను ధాటికి చేతికందొచ్చిన పంటను కోల్పోయిన కౌలురైతులు, పేదరైతులకు ఎకరాకు రూ.30వేలు నష్ట పరిహారం ఇవ్వాలని కౌలు రైతు సంఘం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాజోలు మండలం బి.సావరం, కడలి తుపాను కారణంగా తడిచిన ధాన్యాన్ని నీట మునిగిన వరి చేలను కౌలు రైతు సంఘం బందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను కారణంగా నష్ట పోయిన కౌలు రైతులకు ఎకరాకు రూ.30వేల అందజేయాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో సుమారు లక్షా అరవైవేల ఎకరాల సాగు చేస్తుండగా 50శాతం మాత్రమే మాసూళ్లు జరిగాయన్నారు. మిగిలిన 50 శాతం పంట తుపాను కారణంగా రైతులు నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుంగ సత్యనారాయణ, తాడి శ్రీరామమూర్తి, యార్లగడ్డ శ్రీరాములు సంఘ నాయుకులు పాల్గొన్నారు.


రాజోలు మండలం లో నీట మునిగిన వరిచేలును పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘ బృందం

సమస్యలకు నిలయంగా పశువైద్యశాలలు

- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, పశుపోషకులు
- కానరాని ఉన్నతాధికారులు పర్యవేక్షణ

ప్రజాశక్తి-మండపేట

పశువుల పునరుత్పత్తితోపాటు, వాటికి సోకే వ్యాధులను అరికట్టడంలో భాగంగా ఏర్పాటుచేసిన గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పశువైద్యశాలలు సమస్యలకు నిలయంగా మారుతున్నాయి. దీంతో అటు రైతులు, పశు పోషకులు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని ఏడిద గ్రామంలో ఉన్న పశువైద్యశాలల్లో పశువులకు చికిత్స అందించేందుకు ఏర్పాటుచేసిన బోన్లు విరిగిపోవడం, ఆస్పత్రి ఆవరణలో ఉన్న పైపు మరమ్మతులు గురి కావడంతో నీటి సౌకర్యం లేకపోవడంతో వైద్యం కోసం పశువులు తీసుకొచ్చే పశుపోషకులు రైతులు పనిచేసే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్తమూరు గ్రామంలోని పశువైద్యశాలలో మరుగుదొడ్లలో కనీస నీటి సౌకర్యం లేకపోవడం, వైద్యులు అందుబాటులో లేని నేపథ్యంలో సిబ్బంది పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో వైద్యం కోసం వచ్చే పశుపాషకులకు అవస్థలు తప్పడం లేదు. అంతేకాకుండా ద్వారపూడి గ్రామంలోని పశువైద్యశాల చుట్టూ రక్షణ కూడా లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతుంది. ఉదయం వచ్చేసరికి తాగి పడేసిన మందు బాటిళ్ల వినిపిస్తున్నాయని వాటిని సమయం పడుతుందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం సమస్యలపై శ్రద్ధ చూపకపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది.


మండపేట మండలం అర్తమూరులో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది


మండపేట మండలం ఏడిద పశువైద్యశాలలో మరమ్మతులు గురైన పైపు


మండపేట మండలం ఏడిద పశువైద్యశాలలో విరిగిపోయిన పశువులబోను


మారేడుబాక ప్రధాన రోడ్డులో రక్షణ గోడ లేని వంతెన

వంతెనకు రక్షణ గోడలు నిర్మించాలని వినతి

- తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వివిధ గ్రామాల ప్రజల ఆందోళన

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ఏడిద, సీతానగరం, తాపేశ్వరం, అర్తమూరు, చిన్నద్వారపూడి, మారేడుబాక తదితర గ్రామాల్లో ఉన్న వంతెనలకు రక్షణ గోడలు నిర్మించాలని ఆప్రాంతాల ప్రజలు అధికారులను విన్నవిస్తున్నారు. ఈ గ్రామాల్లో ఉన్న వంతెనలకు ఇరువైపులా రక్షణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు చెబుతున్నారు. అనేకమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వారు అంటున్నారు. మండలంలోని తాపేశ్వరం గ్రామంలో నాలుగు విగ్రహాల జంక్షన్ వద్ద ఉన్న వంతెన సుమారు ఏడు ఏళ్ల క్రితమే భారీ వాహనాలు ఢీకొనడంతో రక్షణ గోడలు కూలిపోయాయి. దీనికి సమీపంలోనే ఉన్న కాలినడక వంతెన రక్షణ గోడలు విరిగిపోయాయి. ఇక్కడ ఉన్న రెండు కాలనీల ప్రజలు మెయిన్ రోడ్డుకు వెళ్లేందుకు ఈ వంతనలే ఆధారం. ఇది ఇలా ఉండగా పంచాయతీ ఎదురుగా ఉన్న సబ్ సెంటర్ శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు దానిని కూల్చివేశారు. కాలనీలోనే ఉన్న కమ్యూనిటీ హాల్లో సబ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. సబ్ సెంటర్ వద్ద నెలలో ఒక్కరోజు నిర్వహించే 104 వాహనం, అత్యవసర పరిస్థితులలో వచ్చే 108 వాహనాలు కాలనీలోకి రావాలంటే ఈ వంతెన మీదుగా రావాల్సి ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా మండపేట నుంచి మారేడుబాక వెళ్లే ప్రధాన రోడ్డులోని పంటకాలపై ఉన్న వంతెనకు రెండు వైపులా రక్షణ కూడా లేకపోవడంతో ప్రమాద భరితంగా మారిందని ప్రజలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

అసంపూర్తిగా ప్రభుత్వ పాఠశాల భవనం

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని మెర్నిపాడు గ్రామంలో ప్రభుత్వం, విద్యాదాత గ్రామ సర్పంచ్ గారపాటి సౌజన్య అశోక్ కుమార్ ఆర్థిక సాయంతో నిర్మించిన మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో దాని స్థానంలో కొత్త భవనం కట్టేందుకు ప్రభుత్వం సుమారు రూ.12 లక్షల నిధులు మంజూరు చేసింది. అయితే స్థలం సరిపోకపోవడంతో దాత అశోక్ కుమార్ పై అంతస్తులో మరో రెండు క్లాస్ రూమ్ నిర్మించేందుకు ముందుకు వచ్చారు. నాలుగు నెలల క్రితమే పనులు పూర్తి చేశారు. కింద భవనం 90 శాతం పనులు పూర్తయినప్పటికీ తలుపులు, విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో పాఠశాల భవనం నిరూపయోగంగా మారింది. దీంతో గ్రామంలోని పేద ప్రజలకు ఉన్నత సౌకర్యాలతో విద్యను అందించాలన్న దాత లక్ష్యం నీరు గారుతోంది. స్థానిక సచివాలయం మేడపై ఉన్న గదిలో తరగతులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు పైకి ఎక్కి ఎందుకు దిగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి త్వరితన భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.


మెర్నిపాడులో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

పాడైన పంట పొలాలలో తక్షణమే పంట నష్టం అంచనా వేసి ఎకరానికి రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజుబాబు డిమాండ్ చేశారు. జార్జిపేట, పత్తిగొంది, నీలపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన పంట నష్టాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలోని వంద నుంచి 200 ఎకరాల వరకు పంట నష్టం జరిగిందన్నారు. పంట నష్టం వెంటనే అంచనా వేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సూర్యనారాయణ, సలాది వెంకటరాజు, పెదపాటి రాజగోపాల్, కొంకె సూర్యనారాయణ, కొమ్మిరెడ్డి వాసు, కుడుపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పంట పొలాలను పరిశీలిస్తున్న రాజబాబు

ఘనంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-రామచంద్రపురం

శివల గ్రామ దేవత దుర్గమ్మ అమ్మవారి 14వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ సలహా మండలి ఛైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు వీరబ్రహ్మం, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.


పాల్గొన్న భక్తులు

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మండపేట

నెల్లూరులో ఈనెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించే పిడిఎస్‌యు 23 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పిడిఎస్ యు అధ్యక్షులు బి.సిద్ధు పిలుపునిచ్చారు. స్థానిక బిసి బాలురు కళాశాల వసతి గహంలో పిడిఎస్‌యు మహా సభ పోస్టర్‌ను ఆయన విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా ఉమ్మడి ఎపి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు యు గనిరాజు, జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ, మాజీ రాష్ట్ర అధ్యక్షులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ రాజశేఖర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎం పరుశు రాం, నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఎన్ సునీల్ తదితరులు పాల్గొంటారన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పిడిఎస్‌యు నాయకులు

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

సామర్లకోట డిఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్లో ఆదివారం విక్టరీ ఫూటోఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ కరాటే పోటీల్లో ఏలేశ్వరం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని మాస్టర్ శిడగం శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీల్లో స్పారింగ్‌లో దిమ్మల మధు కిరణ్ గోల్డ్ మెడల్, దినేష్ కార్తీక్ ఎల్లో మెడల్ సాధించారన్నారు. కటాస్ విభాగంలో గోల్డ్ సిల్వర్ మెడల్ సాధించారన్నారు. విజేతలకు గ్రాండ్ మాస్టర్ ఆర్ మల్లికార్జున రావు, సినీ పరిశ్రమలో ఉన్న కరాటే మాస్టర్ లక్ష్మి బహుమతులు అందజేశారన్నారు. విజేతలను పలువురు అభినందించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు దుకాణాలు దగ్ధం

ప్రజాశక్తి - పెద్దాపురం

కాండ్రకోటలో శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. చుట్టుపక్కల వారు ఈ ప్రమాదాన్ని చూసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి శ్రీహరి జగన్నాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు ఆదివారం బాధిత పోబోలు సత్య కృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర రాఘవరావు, సొసైటీ అధ్యక్షుడు పళ్ల గంగారావు, ఉప సర్పంచ్ జోకా నానాజీ పాల్గొన్నారు.